# మంచి వార్త

## సవాలును అవకాశంగా...



**పూనమ్ చతుర్వేది** భారతదేశంలోనే అతి ఎత్తయిన బాస్కెట్ బాల్ క్రీడాకారిణి. ఆమె బరిలో ఉన్న చోట అందరికంటే ఎత్తుగా కనిపిస్తుంది. అక్కడ ఉన్నవాళ్లందరినీ ఆకర్షిస్తుంది. ఆమె ఎత్తు ఏడు అడుగులు. అయితే బాస్కెట్ బాల్ క్రీడలో రాణించడానికి ఆమె ఎన్నో శారీరక, మానసిక సవాళ్లను ఎదుర్కొని ఎదిగిన వైనం అందరికీ స్ఫూర్తిదాయకం. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్‌లో జన్మించిన పూనమ్ బడి చదువు ముగిసే నాటికే ఆరు అడుగులకు పైగా ఎత్తు పెరిగింది. ఇది ఆమెను తోటివారి నుంచి ఎన్నో అవహేళనలకు గురిచేసింది. అయితే, పూనమ్ ఓసారి వీధిలో నడుస్తుంటే అటుగా వెళ్తున్న ఓ పరిచయస్తుడు ఆమెను గమనించాడు. అంతే ఆమె దగ్గరికి వెళ్లి ''నువ్వెప్పుడైనా బాస్కెట్ బాల్ ఆడాలని అనుకున్నావా?'' అని అడిగాడు. ఈ ఒక్కప్రశ్న పూనమ్ మనసులో బాస్కెట్ బాల్ క్రీడలో రాణించాలనే సంకల్పానికి పాదు చేసింది. అలా ఆమె గ్రౌండ్‌లో అడుగుపెట్టింది. ఆరు అడుగులకుపైగా ఎత్తుతో అవమానాలు ఎదుర్కొన్న తాను దాన్ని బలంగా మార్చుకునేందుకు బాస్కెట్ బాల్ ఆటను ఓ గొప్ప అవకాశంగా పరిగణించింది. ఆటలో కూడా తొందరగా రాణించి రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైంది. ఇంతలో ఆమెకు బ్రెయిన్ ట్యూమర్ రూపంలో మరో కొత్త సవాలు ఎదురైంది. దీంతో బాస్కెట్ బాల్ ఆట మాత్రమే కాకుండా ఆమె జీవితమే ప్రమాదంలో పడిపోయింది. రెండు మేజర్ సర్జరీలు జరిగాయి. ఐదేళ్లపాటు ఆటకు పూర్తిగా దూరమైపోయింది. అయినప్పటికీ బాస్కెట్ బాల్ అంటే పూనమ్‌కు ఉన్న ఆసక్తి కొంచెం కూడా తగ్గలేదు. 2019లో ఆమె బ్రెయిన్ ట్యూమర్ నుంచి పూర్తిగా కోలుకున్నది. మళ్లీ గ్రౌండ్‌లో అడుగుపెట్టింది. ఇకముందు ఆడటం అసలే కుదరదనే పరిస్థితి నుంచి మళ్లీ బరిలో దిగడం ఆమె పోరాట స్ఫూర్తిని చాటి చెబుతుంది. ఇప్పుడామె జాతీయ స్థాయి మహిళల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నది. ముందుముందు జరగబోయే బాస్కెట్ బాల్ పోటీల్లో పూనమ్ సాధించే విజయాలు ఆమెను మరింత ఉన్నతంగా నిలబెట్టాలని కోరుకుందాం.

## వైతాళికుల వాణి

జీవితంలో ఎప్పుడూ పడిపోకపోవడంలో గొప్పతనం ఏదీ ఉండదు. పడిపోయిన ప్రతీసారి పైకి లేవడంలోనే అసలైన గొప్పతనం ఉంటుంది.

• **నెల్సన్ మండేలా**
(దక్షిణాఫ్రికా స్వాతంత్ర్య సమరయోధుడు)

## క్యా సీన్ హై!

